ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 30 సెప్టెంబరు 2025

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉదయం: 8-10 మధ్య
సూర్యప్రభ వాహనం
మధ్యాహ్నం: 1-3 మధ్య
స్నపన తిరుమంజనం
రాత్రి: 7-9మధ్య
చంద్రప్రభ వాహనం











గజ వాహనం ముందు అమ్మవార్ల అలంకరణలతో కళా ప్రదర్శన

ముచ్చటగా మూడు వాహనాలు

తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మలయప్పస్వామి మూడువాహనాలపై నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. ఉదయం 9 గంటలకు కోదండరాముడిగా హనుమంతవాహనంపై.. సాయంత్రం 4 గంటలకు స్వర్ణరథంపై.. పట్టాభిషేకానికి వెళ్లే రారాజులా రాత్రి 7 గంటలకు గజవాహనంపై భక్తకోటిని అనుగ్రహించారు. పెరటాశి రెండో శనివారం, ఆదివారం గరుడసేవ సందర్భంగా తిరుమల కిటకిటలాడింది. ఆదివారం అర్ధరాత్రికే చాలా మంది తిరుగు ప్రయాణం కావడంతో రద్దీ సాధారణస్థితికి చేరుకుంది. మరోవైపు తిరుమలలో చలి తీవ్రత పెరిగింది. అయినా, భక్తులు గ్యాలరీల్లోనే కూర్చుని వాహన సేవలను వీక్షించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వెరీగుడ్.. బాగా చేశారు

టీటీడీకి 'ఎక్స్'లో సీఎం అభినందనలు



'తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన మలయప్ప స్వామి గరుడవాహన సేవ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీటీడీకి అభినందనలు' అంటూ సీఎం చంద్రబాబు ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. శ్రీవారి ఆలయం, గరుడ వాహనసేవ, శ్రీవారి సేవకుల సేవలు, భక్తుల ఫొటోలను తన పోస్టుకు జత చేశారు. గరుడ సేవకు తరలివచ్చిన 3 లక్షల మందికి పైగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారికి మంచి అనుభూతిని మిగిల్చారని కొనియాడారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన, సమన్వయంతో వ్యవహరించిన టీటీడీ బోర్డు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, జిల్లా అడ్మినిస్ట్రేషన్, పోలీసులకు అభినందనలు తెలిపారు. 'తిరుమల కొండ పవిత్రతను కాపాడుతూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తరించిన భక్తకోటికి ధన్యవాదాలని పోస్ట్ చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బంగారు కుటుంబానికి ఆటో

- పీ4 కార్యక్రమంలో 'మార్గదర్శి'గా అందించిన రాస్



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పీ4 కార్యక్రమంలో భాగంగా దత్తత తీసుకున్న కుటుంబానికి 'రాస్' ఆటోను అందించింది. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురానికి చెందిన సతీష్ ఆటో డ్రైవర్. అనారోగ్య సమస్యలతో సుమారు రూ.20లక్షల వరకు ఖర్చు చేశారు. దీంతో జీవన పరిస్థితి దుర్భరంగా మారింది. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి తన గోడు వెల్లబోసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ద్వారా రాస్ సంస్థను కలెక్టర్ సంప్రదించారు. బంగారు కుటుంబ దత్తత కార్యక్రమంలో భాగంగా రాస్ సంస్థ ముందుకువచ్చింది. సంస్థ అందించిన ఆటోను బాధిత కుటుంబానికి సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ అందజేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంటకరత్నం, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాలకు దసరా కానుక

వాహన మిత్ర ద్వారా 14,375మందికి లబ్ధి

తిరుపతి(రవాణా), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలకు దసరా కానుకగా ప్రభుత్వం వాహనమిత్ర పథకాన్ని ప్రకటించింది. జిల్లాలో ఈ పథకం ద్వారా 14,375మంది ఆటోడ్రైవర్లకు రూ.15వేలు చొప్పున జమ చేయనుంది. 14,757మంది దరఖాస్తు చేసుకోగా 14,375 మంది అర్హుల పేర్లను ప్రకటించింది. అక్టోబరు 1న సీఎం చంద్రబాబు వారి ఖాతాల్లో డబ్బు జమ చేయనున్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా తమ ఉపాధికి గండిపడుతోందని డీలాపడ్డ ఆటోడ్రైవర్లు ప్రస్తుతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ లబ్ధి



అర్హులైన ఆటోడ్రైవర్లందరికీ వాహనమిత్ర పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలి. ఆదాయపు పన్ను, నెలవారి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటినా, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి స్థిరాస్తి ఉన్న వారికి వర్తించదు.

- మురళీమోహన్, జిల్లా రవాణాశాఖాధికారి

నిషేధిత జాబితా నుంచి
ఆటోనగర్ స్థలాలకు విముక్తి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆటోనగర్ స్థలాల రిజిస్ట్రేషన్లపై 22ఏ నిషేధాన్ని ఎత్తివేశారు. సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆటోనగర్ యజమానులుఊరట చెందారు. చాన్నాళ్లుగా వీరు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించింది. రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. చట్టబద్ధంగా యజమానులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. 337 ఆటోమొబైల్ యూనిట్లకు ప్రయోజనం చేకూరింది.

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులతో చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణిరాయశయర్ సమక్షంలో మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.వెంకటముని, ఎం.గోపినాథ్, మునిరత్నమ్మ, కె.దుర్గా, పి.పాపమ్మ, జి.దేవి, ఎం.గోపాల్‌రెడ్డి, యూ.భారతి, ఎం.యోగానందం, బీవీ.స్వప్న, పద్మావతిలు ప్రమాణ స్వీకారం చేసారు. చంద్రశేఖర్‌రెడ్డిని చైర్మన్‌గా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పాలక మండలి నియమించినందుకు ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మమత, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ చార్జీల తగ్గింపుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో వాసుదేవరావు

పాకాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీ చార్జీల వల్ల కలిగే ప్రయాజనాలు ప్రజలందరికీ అందించాలని ఎంపీడీవో వాసుదేవరావ్ కోరారు. సోమవారం ఊట్లవారిపల్లెలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. దుకాణాలకు వెళ్లి తగ్గించిన జీఎస్టీ ధరలకు వస్తువులు అందజేయాలని, ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ సిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కులను సద్వినియోగం చేసుకోండి

రామచంద్రాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పౌరహక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు మధుసూదన్‌రావు పిలుపునిచ్చారు. పెద్దనాయుడుకండ్రిడ ఏఏడబ్ల్యూలో సోమవారం మండలస్థాయి అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ ప్రజా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పింఛన్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంఈవో మార్కొండయ నాయుడు, బీసీ హాస్టల్‌వార్డెన్ నాయక్, వీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

హనుమంత, గజవాహనాలపై శ్రీహరి అభయం



హనుమంతవాహనంపై ఊరేగుతున్న కల్యాణవేంకటేశ్వరస్వామి

తిరుపతిరూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు ఉదయం హనుమంతవాహనంపై, రాత్రి గజవాహనంపై ఊరేగి భక్తులకు అభయమిచ్చారు. గ్రామస్తులు కర్పూరహారతులు పట్టి మొక్కు తీర్చుకున్నారు. చంద్రగిరి, ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం, రామిరెడ్డిపల్లె, కొటాల, ఐతేపల్లె, అగరాల, ఎ.కొంగరవారిపల్లె, కల్‌రోడ్డుపల్లె, పనబాకం గ్రామాల భక్తులు సారెని సమర్పించారు. చెవిరెడ్డి లక్ష్మి, మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణతో మహిళా సాధికారత

భాకరాపేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో మహిళా సాధికారతకు ప్రభుత్వ భరోసా కల్పించిందని తహసీల్దారు భాగ్యలక్ష్మి అన్నారు. జీఎస్‌టీ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్‌టీ 2.0 సంస్కరణల ఫలితంగా రోజువారీ వస్తువుల ధరలు తగ్గిపోయాయన్నారు. నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్‌టీ రేట్లు ప్రస్తుతం రెండు స్లాబులుగా మార్చివేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్ కుమార్, హెచ్‌వో ఆసియా, ఆర్‌ఐ జానకీరామ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో సోమవారం దసరా సంబరాలు అలరిస్తున్నాయి. సోమవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌ఏటీవీసీపీ అకాడమికి చెందిన కళాకారులు పవన్, కల్యాణ్, పద్మజ, భాను,చతుర్య, పరణిత తదితరులు వినాయక కౌత్వం, అల్లరిప్పు, జతీస్వరం, అఖిలాండేశ్వరి, నటేష్ కౌత్వం, ,నరసింహకౌతం తదితర కీర్తనలకు నర్తించి మెప్పించారు. వీరికి శిల్పారామం అధికారులు సూర్యతేజ, రాధాకృష్ణ ప్రశంసాపత్రాలు అందజేశారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

సదుం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంతోనే శక్తివంతమైన సమాజం ఏర్పడుతుందని చిన్నగొట్టిగల్లు సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ అన్నారు. చిన్నగొట్టిగల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహికోఉ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, ఎంపీటీసీ విజయ కుమారి, సర్పంచ్ మనోహర పాల్గొన్నారు.

ముగ్ధమనోహరం.. అష్టలక్ష్మీ వైభవ నృత్యం

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) :బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక నాద నీరాజనం, ఆస్థాన మండపంలో టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఎస్వీ సంగీత నృత్య కళాశాలకు చెందిన సాయికిషోరి బోస్ బృందం అష్టలక్ష్మీ వైభవం నృత్య ప్రదర్శన ముగ్ధ మనోహరంగా సాగింది. తొలుత రవిప్రభ, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, వినోద్, విజయ్‌కుమార్ బృందం మంగళ ధ్వని, ఎస్వీ ఉన్నత వేద విద్యాధ్యయన సంస్థ వేద పారాయణం, లక్ష్మీ బృందం విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన కులకర్ణీ బృందం భక్తి సంగీత విభావరి, స్థలశాయి భక్తి సందేశం భక్తిపారవశ్యాన్ని నింపింది.

అందరికీ జీఎస్టీ ఫలాలు అందేదెప్పటికో?

● చాలావరకు పాత ధరలకే విక్రయాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును వారం కిందటే అమలు చేసినా, ఇప్పటికీ వాటి ఫలాలు చాలా వరకు ప్రజలకు అందలేదు. ప్రధానంగా వంట నూనెలు, సబ్బులు, పౌడర్లు, పప్పులు, టూత్ పేస్టులు, అగర బత్తీలు, రాగి పిండి, సేమియా, బ్రష్‌లు, ఇతర వస్తువులపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి కేంద్రానికి తగ్గించింది. దీంతో ఒక్కో వస్తువుపై రూ.5 నుంచి రూ.10 వరకు ధర తగ్గింది. ఇవి చాలా దుకాణాల్లో అసలు అమలు చేయడంలేదు. కానీ, తిరుపతిలోని చాలా దుకాణాల్లో అడిగితే, ఇప్పటి వరకు తమకు ఉత్తర్వులు అందనందున పాత ధరలకే విక్రయిస్తున్నామని చెప్పారు. ధరలు సిస్టమ్‌లో అప్‌లోడ్ కావడంలేదని, ఏ వస్తువు ఎంతకు అమ్మాలో తెలియనప్పుడు కొత్త ధరలకు ఎలా అమ్మాలని కొందరు ప్రశ్నిస్తున్నారు. సూపర్ మార్కెట్ విక్రయాలు జరిగే ఉత్పత్తులపై 12 నుంచి 18 శాతం వున్న జీఎస్టీ 5 శాతానికి తగ్గించారు. వీటిలోనూ ఇదే పరిస్థితి. జీఎస్టీ తగ్గింపుపై అన్ని దుకాణాల వద్ద బ్యానర్లు, ఫ్లెక్సీలతో హడావుడి చేస్తున్న జీఎస్టీ అధికారులు.. తగ్గిన ధరలు అమలవుతున్నాయా లేదా అని పరిశీలించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఇకనైనా ఉమ్మడి జిల్లా జీఎస్టీ జాయింట్ కమిషనరు దృష్టి సారించి, తగ్గిన ధరలు అన్ని షాపుల్లోనూ అమలయ్యేలా చూడాలని కోరుతున్నారు.

కొల్హాపూర్ అమ్మవారికి టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొల్హాపూర్ మహాలక్ష్మీ అమ్మవారికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు సోమవారం టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద వారికి ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బోర్డు సభ్యురాలు ప్రశాంతి, శాంతారామ్, భానుప్రకాష్‌రెడ్డి, సౌరభ్‌బోరా, ఎక్స్‌అఫిషియో సభ్యుడు దివాకర్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

తల్లీకొడుకులపై దాడి

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): చల్లకుంట దళితవాడకు చెరందిన తల్లికొడుకులపై అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేసి గాయపరిచారు. బాధితుల కథనం మేరకు దళితవాడకు చెందిన బొమ్మాజి ఎర్రయ్యా, ముత్యాలు దంపతులు. వీరి ఇంటి ముందు పాతిక సంవత్సరాలుగా పశువుల ఎరువు వేసేందుకు దిబ్బ ఏర్పాటు చేసుకుని ఉన్నారు. రేకులషెడ్డు, పందిరి వేసుకుని ఉన్నారు. శ్మశానానికి దారి కావాలని గ్రామానికి చెందిన పి.సుబ్రహ్మణ్యం, రమణయ్య, బి.సుబ్రహ్మణ్యం, బి.భారతి, బి.గంగయ్య, రెడ్డమ్మ, బి.వెంకటకిషోర్, సంపూర్ణ, సాయి, రోజా, ఎం.సుబ్రహ్మణ్యం, గంగులమ్మ, పి.ప్రసాద్, బి.ప్రసాద్, మునస్వామి, గణేష్,జనార్ధన్ తదితరులు ఆదివారం వాటిని ఎక్సకవేటరుతో తొలగించి మన్ను తోలి చదును చేశారు. అడ్డుకున్న ముత్యాలుపై దాడి చేశారు. కుమారుడి పైనా దాడి చేశారు. అతడి తలకు గాయాలయ్యాయి. ఘటనపై ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బాలకృష్ణ విచారణ చేపట్టారు. తమ అనుభవంలోని భూమి దక్కకుంటే ఊరి నుంచి వెళ్లిపోతామని ముత్యాలు కన్నీటి పర్యంతమైంది.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి దుర్మరణం



మోహన్ (ఫైల్‌ఫొటో)

పాకాల, సెప్టెంబరు 29: పూతలపట్టు- నాయుడుపేట హైవే సర్వీస్‌రోడ్డులో ఇరుగు రంగయ్యగారిపల్లె సమీపంలో సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సు మోటారు సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. చంద్రగిరి మండలం రమణప్పగారిపల్లెకు చెందిన ఆర్మీ ఉద్యోగి మోహన్ (35) ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం రాత్రి సుమారు 7-30 గంటల ప్రాంతంలో నేంద్రగుంట వైపు నుంచి ఇతడు మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

పాకాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్దినాయనపల్లె పంచాయతీ ఓబులశెట్టివారిపల్లెలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన అప్పాజి నాయుడు కుటుంబంతో కలిసి శనివారం ఇంటికి తాళం వేసుకొని తిరుమల బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. తిరుమల నుంచి తిరిగి సోమవారం ఉదయం వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ని 35 గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- ●శనివారం హుండీ ఆదాయం: రూ.3.79 కోట్లు
- ●ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,496
- ●తలనీలాలు సమర్పించినవారు: 29,591

పవన్‌కల్యాణ్ కోలుకోవాలని పూజలు



అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న ఎమ్మెల్యే ఆరణి తదితరులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వైరల్ ఫీవర్‌తో ఇబ్బందిపడుతున్న జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం అలిపిరి గరుడ వలయం వద్ద బ్యానర్ ప్రదర్శిస్తూ శ్రీవారిని వేడుకున్నారు. పాదాల మండపం వద్ద 201 కొబ్బరికాయలు కొట్టారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, హరిశంకర్, రుద్రకిషోర్, మనోజ్, దినేష్‌జైన్, సుమన్‌బాబు, మునస్వామి, అనీల్‌రాయల్, సునీల్, వెంకటేశ్, మధులత, రాధ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయం కిటకిట



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం సోమవారం భక్త జన సంద్రంగా మారింది. దసరా సెలవుల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 29వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 84 మంది, రూ.200 శీఘ్ర దర్శనం 1,403, రూ.50ప్రత్యేక దర్శనం ద్వారా 2,390మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,882మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,019, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 287, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 193, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 52మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,467 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సమష్టి కృషితో గరుడోత్సవం భళా

● 2.40 లక్షల మందికి సంతృప్తికర దర్శనం



ఆదివారం గరుడోత్సవంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో సింఘాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు

తిరుమల, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): టీటీడీ కృషి ఫలించింది. గరుడోత్సవ వేళ భక్తులందరికీ సంతృప్తికర దర్శనం లభించింది. అన్ని విభాగాల సమష్టి కృషి, నిరంతర అప్రమత్తత, ముందస్తు ప్రణాళికల ఫలితంగా ఇది సాధ్యమైంది. బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనసేవకు ప్రత్యేకమైన స్థానముంది. ప్రియవాహనుడిపై విహరించే ఉత్సవమూర్తిలో మూలమూర్తి అవహించి తమను అనుగ్రహిస్తారని భక్తులు విశ్వసిస్తారు. ఈ క్రమంలోనే ఏటా లక్షలాదిగా తరలి వస్తున్నారు. కొవిడ్ తర్వాత ఈ సేవకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. గతేడాది దాదాపు 3 లక్షల మంది తిరుమలకు చేరుకున్నారు. ఈసారీ అదేస్థాయిలో భక్తులు తరలివచ్చారు. గ్యాలరీల ద్వారా దాదాపు 2 లక్షల మంది, అదనపు క్యూలైన్లు, రీఫిల్లింగ్ ద్వారా మరో 40 వేల మంది గరుడవాహన దర్శనం చేసుకున్నారు. పెరటాశి రెండో శనివారం, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో రద్దీ అధికంగా ఉంటుందనే ముందస్తు అంచనాతో టీటీడీ పక్కాప్లాన్‌ను రూపొందించింది. భక్తుల తాకిడిని సమర్థవంతంగా ఎదుర్కొంది.

ఫలించిన సమన్వయం

గతానుభవమున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు కలిసి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. అన్ని విభాగాలను సమన్వయానికి చేసిన కృషి ఫలించడంతో గరుడోత్సవం విజయవంతమైంది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి తన తండ్రి మరణంతో ఉత్సవం సమయంలో లేకున్నా ముందస్తుగా సమీక్షలు నిర్వహించి, తగిన ఆదేశాలు జారీ చేయడంలో కీలకపాత్ర వహించారు. శ్రీవారిసేవకుల సహకారంతో 4 లక్షల మందికి అన్నప్రసాదాలు అందజేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులు మినహా మరే వాహనం కొండమీదకు అనుమతించకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తలేదు.



గాయత్రిదేవి అలంకరణలో ఎల్లమ్మ



సరస్వతీదేవిగా మిట్టమీద గంగమ్మ




కాళరాత్రి అలంకరణలో ప్రత్యంగిరాదేవి



రాజరాజేశ్వరిగా భవానీ అమ్మవారు



సరస్వతిగా చాముండేశ్వరీదేవి



సరస్వతీదేవిగా మూలస్థాన ఎల్లమ్మ

దివ్యరూపం.. భవ్యతేజం



సరస్వతిగా గంగమ్మ (చిన్నగొట్టిగల్లు)



సరస్వతీ దేవిగా నేంద్రగుంట మూలస్థానమ్మ

చంద్రగిరి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రి మహోత్సవాలలో భాగంగా మూలస్థాన ఎల్లమ్మ సోమవారం రాత్రి గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని గాయత్రిదేవిగా విశేషాలంకరణ చేసి అశ్వవాహనంపై ఊరేగించారు. మిట్టమీద గంగమ్మను సరస్వతిదేవి గా అలంకరించి హంస వాహనంపై ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం ఆవరణలోని సంతోషిమాతకి సరస్వతీదేవి సహస్రనామార్చన,చేశారు. తొండవాడ ఉగ్రప్రత్యంగిరా దేవి కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. **రామచంద్రాపురం:** రాయల చెరువుకట్ట జలకంఠేశ్వరాలయంలో ఉపాలయాల్లో మహాలక్ష్మీ అమ్మవారు, భవాని అమ్మవారు, కామాక్షి అమ్మవారు సోమవారం రాజరాజేశ్వరిదేవిగా అలంకారంలో దర్శనమిచ్చారు. శక్తి పీఠంలో మరకతశక్తి కాళీ అమ్మవారు తార, నీల సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. **పాకాల::** నేంద్రగుంట మూలస్థానమ్మ దేవి, సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. **తిరుపతి రూరల్** :తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీ దేవి, చెంచువారికాలనీలోని మూలస్థాన ఎల్లమ్మలు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు.

తూకి‘వనం’

●స్వచ్ఛతా హీ సేవలో 500 మొక్కలు నాటిన కార్పొరేషన్



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య, నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన తూకివాకం ప్రాంగణం పచ్చదనంగా మారనుంది. తూకివాకంలో మున్సిపల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా సరిహద్దు చుట్టూ మొక్కలు పెంచాలని ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ తిరుపతిలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సూచించారు. ఈ నేపథ్యంలో తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఆవరణలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య మొక్కలు నాటారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదానందం, అధికారులు, సిబ్బంది కలసి 500 మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

స్టాన్‌ఫర్డ్ జాబితాలో ప్రొఫెసర్ జయశంకర్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ సీకే జయశంకర్‌కు స్థానం దక్కింది. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో ఈయన చేరడం వరుసగా ఇది ఆరోసారి. జయశంకర్ ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో సుదీర్ఘకాలం అధ్యాపకుడిగా పనిచేశారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాదరాజు అభినందించారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

రేణిగుంట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోదాముల వద్ద నిరంతరం పటిష్ఠ భద్రత ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వెంక టేశ్వర్ తెలిపారు. విమానాశ్రయం సమీపంలో ఈవీఎంలను భద్రపరచిన సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాములను సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీ లించారు. ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్లతో పాటు భద్రతా చర్యలను పరిశీలించారు. గోదా ములో లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి



:మృతుడు లోకేశ్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతిచెందిన ఘటన మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. తిరుమలనగర్ పంచాయతీ కోళ్లఫారాల సమీపంలో ఓ ఇంటికి పెయింటింగ్ చేస్తుండగా తిరుపతికి చెందిన లోకేశ్(36) విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తోటి కూలీలు సమీపంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే ఆ యువకుడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న మృతుడి భార్య ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించింది. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

‘సీఐపై చర్యలు తీసుకోండి’


తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈనెల 27వ తేదీన సినిమాకు వెళ్లి వస్తున్న తనపై దాడి చేసిన శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత భరత్‌నాయుడు కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

రేపటి నుంచి గుంటూరు-తిరుపతి-ధర్మవరం ఎక్స్‌ప్రెస్

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): గుంటూరు-తిరుపతి-ధర్మవరం మార్గంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. గుంటూరులో ఈ ఎక్స్‌ప్రెస్(17261) రోజూ సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపురం రోడ్డు, కుంభం గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లి, కోయిలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటి రోజు ఉదయం నాలుగు గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరుపతిలో 4.15 గంటలకు బయలుదేరి పాకాల, పీలేరు, కలికిరి, చదనపల్లి రోడ్డు, ములకలచెరువు, కదిరి మీదుగా 9 గంటలకు ధర్మవరం చేరుకుంటుందన్నారు. ధర్మవరంలో అదేరోజు ఈ ప్రత్యేక రైలు(17262) మధ్యాహ్నం 1.20 బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ తిరుపతికి రాత్రి 7.15 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి గుంటూరుకు మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చేరుకుంటుందని వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అర్జీల పరిష్కారంలో చొరవ చూపండి

●నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్



నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు


తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు వచ్చే అర్జీల పట్ల ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 283 వినతులు అందగా అందులో రెవెన్యూ శాఖకే 172 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణముఖి నది ప్రాంతాన్ని కాపాడండి

తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు, యోగిమల్లవరం, కేసీపేట సమీపంలోని స్వర్ణముఖి నదిలో అధికార పార్టీ నాయకులు ఆక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, తిరుపతి రూరల్ కార్యదర్శి సుమన్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల వినతి

గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ విలేజ్, వార్డు సెక్రటేరియట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపింది. సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రభుత్వ భూమిని కాపాడండి

తిరుపతి అర్బన్ మండలం తిరుమలనగర్ పంచాయతీలో ప్రభుత్వ భూమిని కొందరు రాజకీయ నాయకులు ఆక్రమించి వారం రోజులుగా నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదని సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ స్థలాన్ని గతంలో సర్వే ట్రైనింగ్ అకాడమీకి ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా స్పందించి ఆ స్థలాన్ని కాపాడాలని కోరారు.

సరస్వతీదేవిగా తాతయ్యగుంట గంగమ్మ


సరస్వతీదేవిగా తాతయ్యగుంట గంగమ్మ మూలవిరాట్టు


సరస్వతీదేవిగా తాతయ్యగుంట గంగమ్మ ఉత్సవమూర్తి


సరస్వతీదేవిగా పల్లివీధి వేశాలమ్మ



మహాసరస్వతి అలంకరణలో నడివీధి గంగమ్మ, లక్ష్మీపురం సర్కిల్ అన్నపూర్ణదేవి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్లకు పసుపు, కుంకుమ, గంధం, పాలు, పెరుగు, తేనె వంటి సుగంధ ద్రవ్యాలతో సర్వాభిషేకాలు చేశారు. సరస్వతీదేవి అలంకారం చేసి, దూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శనం కల్పించి, కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన నవదుర్గల కలశాల వద్ద ప్రత్యేక పూజలు జరిపి, నైవేద్యం సమర్పించారు. హోమ పూజలను అత్యంత వేడుకగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి సరస్వతీదేవి అలంకారం అనంతరం ఊంజల్ సేవ చేశారు. పల్లివీధి వేశాలమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని తాళ్లపాక పెద్ద గంగమ్మ సరస్వతీదేవిగా కటాక్షించారు. పాత మున్సిపల్ ఆఫీసు అనుకుని ఉండే నడివీధి గంగమ్మ మహా సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఇక కపిలేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తికి అన్నపూర్ణాదేవి అలంకారం చేసి, ఊంజల్ సేవా మండపంలో కొలువుదీర్చారు. సాయంత్రం ఊంజల్ సేవ వేడుకగా నిర్వహించారు.

మహాసరస్వతి అలంకరణలో అన్నపూర్ణదేవి

తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి ఆలయంలో సోమవారం రాత్రి అమ్మవారు మహాసరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్త వీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోని మూలమూర్తి నంది వాహన సమేత శివపరివారంగా, ఉత్సవమూర్తి సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు అభయమిచ్చారు.


నందివాహన సమేత శివపరివారం అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి


పార్వతీపరమేశ్వరుడి అలంకారంలో బొంతాలమ్మ

పార్వతీపరమేశ్వరుడిగా బొంతాలమ్మ

తిరుపతి(జీవకోన), (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారు పార్వతీపరమేశ్వరుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

రేపు గరం గరం చాయ్ పుస్తకావిష్కరణ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఆర్సీ కృష్ణస్వామి రచించిన గరం గరం చాయ్ పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు పీఆర్ఎస్ఐ చైర్మన్ డాక్టర్ జి.ఎస్.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా త్రిపురలోని దమ్మదీప అంతర్జాతీయ బౌద్ధ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం.పి.నరసింహరాజు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు అంగన్‌వాడీ కార్యకర్తలు, 66 హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ వసంతబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15వ తేదీలోపు అర్హత కలిగిన అభ్యర్థులు కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8328562595ను సంప్రదించాలని కోరారు.

మాది చేతల ప్రభుత్వం : ఎమ్మెల్యే


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ తమది చేతల ప్రభుత్వంగా నిరూపించుకుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. కచ్చపి ఆడిటోరియంలో సోమవారం నారాయణ డీఎస్సీ కోచింగ్ సెంటర్ విజయోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉపాధ్యాయుల నియమాకం చేపట్టిందన్నారు. తిరుపతికి చెందిన నారాయణ డీఎస్సీ కోచింగ్ సెంటర్ ద్వారా ఎస్జీటీ 201, స్కూల్ అసిస్టెంట్స్ 99మంది విజయం సాధించారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను కోచింగ్ సెంటర్ నిర్వాహకులు నారాయణ ఆధ్వర్యంలో సన్మానించారు. వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగం కల్పించిన ఎన్డీఏ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని కొనియాడారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ మంత్రి పర్సారత్నం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన అవసరం

వినియోగదారుల సమావేశంలో ఏసీ వరలక్ష్మి


జీఎస్టీ కరపత్రాలు పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, జీఎస్టీ ఏసీ వరలక్ష్మి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తిరుపతి-2 జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వరలక్ష్మి అన్నారు. సోమవారం తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని డీ-మార్టులో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, జీఎస్టీ డిప్యూటీ సహాయ కమిషనర్ నవీన్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌తో కలసి పరిశీలించారు. తగ్గిన జీఎస్టీ ప్రకారం వస్తువుల ధర తగ్గించి విక్రయిస్తున్నారా లేదా అని వినియోగదారులతో ముఖాముఖిగా మాట్లాడి తెలుసుకున్నారు. అన్ని దుకాణాల వద్ద బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించారు. ఇంటింటికీ అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వినియోగదారులను మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎస్వీయూ కబడ్డీ జట్టు


ఎస్వీయూ కబడ్డీ జట్టు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బెలగవి రాణి చిన్నమ్మ యూనివర్సిటీలో అక్టోబర్ 4న జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎస్వీయూ పురుషుల జట్టు ఎంపికైంది. సోమవారం ఉదయం ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులకు జెర్సీ అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎస్వీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌రెడ్డి హాజరై 16మంది క్రీడాకారులను అభినందించారు. జట్టు మేనేజర్, కోచ్ గోవర్ధన్ పాల్గొన్నారు.

అలరించిన హిమబిందు గానం


హిమబిందు భక్తి సంగీత కచేరి

తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఇస్కాన్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం గుంటూరుకు చెందిన విదుషి పొంగూరు హిమబిందు భక్తి సంగీత కచేరి అలరించింది. వనమాలి వాసుదేవ, రాధే రాధే గోవింద వంటి భజనలతోపాటు స్వాగతం కృష్ణ, అన్నమాచార్య సంకీర్తనలను రసరమ్యంగా ఆలపించి ఆహూతులను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. వయోలిన్‌తో జగదీశ్వరరావు, మృదంగంతో విద్యాధర్ సహకరించారు.

ఎస్వీయూ లైబ్రరీలో సరస్వతీదేవి పూజ


సరస్వతి పూజలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో సరస్వతీదేవి పూజా వేడుకగా సాగింది. మూల నక్షత్రం సందర్భంగా సెంట్రల్ లైబ్రరీలోని సరస్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



వాసవీ కన్యకాపరమేశ్వరి సేవలో నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుపతి కొత్తవీధిలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ బోర్డు సభ్యులు కె.శ్రీధర్, జి.హేమరాజ్ శెట్టి, శ్యాంసుందర్, వెంకటేష్ గుప్తా, ద్వారకనాథ్ పామిడి, రామమూర్తి, శిరీష మంజునాథ్, హారిక, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి, అమ్మవారి వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందించి, ఆశీర్వదించారు.

ఆస్టర్ నారాయణాద్రిలో మెగా ఉచిత గుండె వైద్య శిబిరం


వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్టర్ నారాయణాద్రి బృందం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం వినాయకసాగర్ వద్ద మెగా ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 280మంది వాకర్స్‌కు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు వైద్య సంస్థలు కలిసి పనిచేస్తే గుండె సంబంధిత వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సునంద కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హృదయ వ్యాధుల నిరోధంలో ముందస్తు నిర్ధారణ పరీక్షలు కీలకమన్నారు. ఆస్పత్రి సీఏవో శ్రీధర్‌ముని మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ఆస్టర్ నారాయణాద్రి ముందుండి సేవలందిస్తోందన్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్, వైద్యులు ప్రసాద్, ప్రతిమ, సుమంత్‌రెడ్డి, అభిషేక్ ప్రసంగించారు. వినాయకసాగర్ వాకర్స్ క్లబ్, లైఫ్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వినాయకసాగర్‌లో సమస్యలు పరిష్కరించండి

పీజీఆర్ఎస్‌కు 23 వినతులు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 23 వినతులు వచ్చాయి. వినాయకసాగర్‌లో పాడైన పరికరాలకు మరమ్మతులు చేయించాలని, రవీంద్రనగర్‌లో తాగునీటి వసతి కల్పించాలని, పద్మావతి పార్క్ వద్ద అకతాయిల ఆగడాలు అరికట్టాలని, టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, భవానీనగర్‌లో తెలుగు గంగ నీరు ఎక్కువ సమయం పంపిణీ చేయాలని, యాదవకాలనీలో భూగర్భ డ్రైనేజీ మరమ్మతు చేయాలని, తిమ్మినాయుడుపాలెంలో భూగర్భ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వాటిని పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి పాల్గొన్నారు.







పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న పీసీ రాయలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ రాజశ్రీబిర్లా 71వ జన్మదిన వేడుకలు స్థానిక గాంధీరోడ్డులోని కస్తూర్బా కేంద్ర ట్రస్టు చైర్మన్ పి.సి.రాయలు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. ఆమె పేదలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ హాజరయ్యారు. బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గరుడోత్సవం విజయవంతంపై హర్షం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన గరుడసేవ విజయవంతంగా ముగిసినందుకు టీటీడీ యాజమాన్యానికి, పోలీసు యంత్రాంగానికి జనసేన సీనియర్ నేత కిరణ్‌రాయల్ అభినందనలు తెలిపారు. పాలకమండలి, అధికార యంత్రాంగం సమన్వయంతో భక్తులకు మెరుగైన సేవలందించారని కొనియాడారు.

పార్టీ కోసం జీవితాంతం పనిచేస్తాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఇచ్చిన పదవులకన్నా పార్టీ కోసం పనిచేయడమే తనకు సంతృప్తిగా ఉంటుందని టీడీపీ సీనియర్ నేత, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. 1982వ సంవత్సరంలో ఎన్టీ రామారావు పార్టీని స్థాపించినప్పటి నుంచి తాను, తన కుటుంబ సభ్యులు పనిచేస్తున్నామని తెలిపారు. జీవితాంతం పనిచేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష పదవి చేపట్టి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ తనకు ఈ పదవి అప్పగించిన పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడికి, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పండగ వేళ జీఎస్టీ శ్లాబ్ తగ్గించి సామాన్యుల కొనుగోలు శక్తిని పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ చైర్మన్ సదాశివం, టీఎన్‌టీయూసీ నాయకులు హేమంత్‌రాయల్, యశ్వంత్‌రెడ్డి, రాజయ్య, రవిశంకర్‌యాదవ్ పాల్గొన్నారు.


జీఎస్టీ తగ్గింపు కరపత్రాలు చూపుతున్న నరసింహయాదవ్ తదితరులు



స్వర్ణరథంలో మెరిసిన మలయప్ప

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వర్ణరథంలో దేవేరులతో కలిసి మలయప్ప ఊరేగారు. 4 నుంచి 5.10 గంటల వరకు స్వర్ణరథంలోని దేవదేవులను భక్తులు దర్శించారు. చల్లని వాతావరణం, మధ్యమధ్యలో చిరుజల్లుల నడుమ బంగారు రథం శోభాయమానంగా సాగింది. ఈ స్వర్ణరథాన్ని మహిళలు మాత్రమే లాగడం విశేషం. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని గోవిందనామస్మరణలతో స్వర్ణరథం మోకులను పట్టుకుని లాగారు. భక్తులు, శ్రీవారి సేవకులు, అప్పుడప్పుడు భద్రతా సిబ్బంది సహకరించడంతో స్వర్ణరథోత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై శ్రీవారు దర్శనమిచ్చారు. ఆయా వాహన సేవల్లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సంప్రదాయ నృత్య నీరాజనం

కేరళ యక్షగానం, పాండిచ్చేరి ఫోక్ డ్యాన్స్, మైలట్టం, కర్ణాటక పిన్నాల్ అండాళ్ డ్యాన్స్, తెలంగాణ బృందం కోలాటం, ఢిల్లీ కళాకారుల చౌమయూర్ బంజ్, జమ్ము కశ్మీర్ రౌఫ్, పంజాబ్ లూధి నృత్యాలు.. ఇలా సోమవారం ఉదయం 26 కళా బృందాల్లోని 607 మంది కళాకారులు హనుమంత వాహనం ముందు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఒడిశా సంబల్పూడి గౌటిప, మహారాష్ట్రకు సంబంధించి గోందళ్ నృత్యాలతో పాటు శ్రీరామ పట్టాభిషేకం, రామావతారం వంటి పౌరాణిక ఘట్టాలను నృత్య రూపకం ద్వారా ప్రదర్శించారు. ఇక, రాత్రి గజ వాహన సేవలో కర్ణాటక కళాకారుల గజేంద్ర వైభవం, బంజారా నృత్యం, తిరుపతి కళాకారుల మయూర నృత్యం, కోలాటం, గజేంద్రమోక్షం వంటి సంప్రదాయ నృత్యాలు.. తెలంగాణ కళాకారుల పేరిణి.. ఒడిశా కళాకారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు కళా వైభవాన్ని చాటాయి. కీలుగుర్రాల ప్రదర్శన, అష్టలక్ష్మి వైభవం, భరతనాట్య ప్రదర్శనలు భక్తులకు కనువిందు చేశాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

రికార్డుస్థాయిలో భక్తుల 'ఘాట్' ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో గరుడసేవ రోజున రికార్డు స్థాయిలో ఆర్టీసీ బస్సుల్లో భక్తులు ఘాట్‌లో ప్రయాణించారు. ఆదివారం పూర్తిగా 425బస్సులు.. తిరుమల- తిరుపతి మధ్య 5,642 ట్రిప్పులు తిరిగి.. 2,16,753మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. నిమిషానికో బస్సు ఏర్పాటుచేసి సీబీఎస్, రైల్వే స్టేషన్, ఇతర పార్కింగ్ స్థలాల నుంచి భక్తులను తిరుమలకు.. అక్కడ్నుంచి మళ్లీ తిరుపతికి చేర్చారు. కాస్త గతేడాది కంటే దాదాపు 30వేల మందికి అదనంగా రవాణా సౌకర్యం కల్పించడం విశేషం. ఆ ఒక్క రోజులో తిరుమల ఘాట్ ద్వారా ఆక్యుపెన్సీ రేషియో 79శాతం నమోదుకాగా, టికెట్ల ద్వారా రూ.1.8కోట్లు వచ్చింది. ఆర్టీసీ అధికారులను, సిబ్బందిని ప్రజా రవాణాధికారి జగదీష్ అభినందించారు.

సిక్కిం విద్యార్థుల 'మరోని' నృత్యార్చన

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా సిక్కిం బృందం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ప్రకాష్ ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఉద్యోగులు 'మరోని' అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఈ కళాకారుల్లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్, మెడిసిన్ చదువుతున్న విద్యార్థులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వాహన సేవలకు అశ్వాలు దూరం

తిరుమల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈసారి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోని వాహనసేవలకు అశ్వాలు(గుర్రాలు) దూరమయ్యాయి. తొలిరోజు పెద్దశేషవాహనం, మరుసటి రోజు చిన్నశేషవాహన సేవల మినహా మిగిలిన సేవల్లో ఇవి కనిపించలేదు. ఉత్సవ క్రమంలో రెండు గుర్రాలు బెదిరాయి. కొన్నిసార్లు శబ్దాలు కూడా చేశాయి. దీంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా వీటిని గోశాలకు పరిమితం చేశారు. అశ్వవాహన సేవకు మాత్రమే తీసుకువచ్చేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. వైష్ణవి, పద్మావతి అనే రెండు ఏనుగులు కూడా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్నాయి. అయితే గరుడవాహన సేవ నుంచి రెండూ పాల్గొంటున్నాయి.

బాలుడి అప్పగింత



తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : తిరుమలలో తప్పిపోయిన ఏడేళ్ల బాలుడిని పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుప్పం మండలం కెకెతొండ ప్రాంతానికి చెందిన మురుగేష్ కుటుంబం సోమవారం తిరుమలకు వచ్చింది. అఖిలాండం వద్ద మధ్యాహ్నం రద్దీలో మురుగేష్ కుమారుడు చైతన్య నాయక్ తప్పిపోయాడు. వీరు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. డిజిటల్ చైల్డ్ ట్యాగ్ సిస్టమ్ ద్వారా ఈ బాలుడిని గుర్తించి ఎస్పీ సుబ్బరాయుడు సమక్షంలో తల్లి హంసకు అప్పగించారు.



పట్టాలు తప్పిన టవర్ కారు

రైల్వే సిబ్బంది మధ్య కరువైన సమన్వయం

- మోటకంపల్లె వద్ద పట్టాలు తప్పిన టవర్‌కార్
- ఆరేడుగంటలు ఆగిపోయిన పలు రైళ్లు

పూతలపట్టు/చిత్తూరు రూరల్/పాకాల/తిరుపతి సెంట్రల్,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-తిరుపతి రైలుమార్గంలో సోమవారం ఓ టవర్ కార్ పట్టాలు తప్పి పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.పూతలపట్టు -పాకాల స్టేషన్ల మధ్యలో సోమవారం రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ పనులు జరిగాయి.పట్టాలతో పాటు విద్యుత్ లైన్లను సిబ్బంది పరిశీలించేందుకు 11.30గంటలనుంచి 1.30 గంటల దాకా ఇంటిగ్రేటెడ్ బ్లాక్ పేరుతో రాకపోకలను ఆపారు.అయితే 12గంటల సమీపంలో పి.కొత్తకోట సమీపంలోని మోటకంపల్లె వద్ద రైల్వే సిబ్బంది మధ్య సమన్వయం కరువై విద్యుత్ లైన్లు చెక్ చేసే ఓహెచ్ఈ ఇన్‌స్పెక్షన్ కారు ఇంజన్ పట్టాలు తప్పింది. దీంతో తిరుపతి-చిత్తూరు మార్గంలో రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఎక్కడికక్కడ స్టేషన్లలో ఆపేశారు.తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ ప్రమాద స్థలం వద్దకు వెళ్లారు. రేణిగుంట నుంచి లూకాస్‌ను సంఘటనా స్థలానికి తీసుకెళ్లి ఈహెచ్ఈ ఇన్‌స్పెక్షన్ కారును పట్టాలెక్కించి పాకాలకు తరలించేటప్పటికి సాయంత్రమైంది.రాత్రి 8గంటలకు మరమ్మతులు పూర్తి చేసి రైళ్ల రాకపోకలను అధికారులు పునరుద్ధరించగలిగారు.శబరి,మన్నార్గుడి,వెంకటాద్రి, శేషాద్రి,భువనేశ్వరి, రామేశ్వరం, నాగర్‌కోయిల్,ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు తిరుపతి-కాట్పాడి ప్యాసింజరు తదితర రైళ్లు ఆరేడుగంటలు ఆలస్యంగా నడిచాయి. పూతలపట్టు రైల్వేస్టేషన్‌లో కోయంబత్తూరు నుండి తిరుపతి వెళ్ళే రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. అంతకుముందు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రైలు చిత్తూరు స్టేషన్‌లో గంటసేపు ఆగిపోవడంతో ప్రయాణికులు ఆరా తీశారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం ఆగిందని రైల్వే సిబ్బంది చెప్పారు. అదే రైలు పూతలపట్టులో మళ్లీ ఆగిపోవడంతో ప్రయాణికులు రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో టవర్ కారు పట్టాలు తప్పిందని, 2-3 గంటలు ఆలస్యం కావొచ్చని రైల్వే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ప్రయాణికులు ఒకటిన్నర కిలోమీటరు దూరం కొంతమంది ఆటోల్లో, కొంతమంది నడుచుకుంటూ చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారికి చేరుకొని బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.బెంగళూరు-తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12 గంటల నుంచి పూతలపట్టు రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది.మన్నార్‌గుడి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను మధ్యాహ్నం 1-30 నుంచి చిత్తూరులోనే ఆపేశారు. రామేశ్వరం-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను పాకాలలో నిలిపివేశారు. పాకాలకు సాయంత్రం 4 గంటలకు రావలసిన కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ను ముంగిలిపట్టులోనే ఆపేశారు. శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కాట్పాడిలో,హౌరా ఎక్స్‌ప్రెస్‌ను రామాపురంలో, తిరుపతి-కాట్పాడి, కాట్పాడి తిరుపతి డెము రైళ్లను నిలిపివేశారు. రాత్రి 8 గంటల వరకూ అవస్థలు పడిన ప్రయాణికులు తర్వాత లైన్ క్లియర్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.



టవర్‌కారును పట్టాలపైకి చేరుస్తున్న లూకాస్



తిరుపతి స్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు



పూతలపట్టు స్టేషన్ నుంచి నడిచివచ్చి బస్సెక్కుతున్న ప్రయాణికులు



పాకాల రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన రామేశ్వరం ఎక్స్‌ప్రెస్

కుటుంబమంతా అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులే!

- ఐదుగురికీ ఒకే విశ్వవిద్యాలయం నుంచి పట్టాలు
- వారిలో నేడు స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ అందుకోనున్న తిరుపతికి చెందిన గాయత్రి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వారంతా ఒకటే కుటుంబం. భార్యాభర్తలు, వారికి ముగ్గురు సంతానం. పలు కారణాలతో సంప్రదాయ ఉన్నత విద్యకు దూరమైన వీరంతా డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులుగా.. తమ లక్ష్యమైన ఉన్నత విద్యను అభ్యసించారు. వీరిలో తాజాగా పీజీ పూర్తి చేసిన ఒకరు మంగళవారం జరిగే స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోనున్నారు. తిరుపతికి చెందిన ఎస్.శ్రీధర్ అనే వ్యక్తి టీటీడీలో ఒక చిరుద్యోగి. ఆయనకు ఉన్నత విద్య చదవాలని లక్ష్యం, కానీ అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. కుటుంబ స్థితిగతుల నేపథ్యంలో చిన్న ఉద్యోగంలో చేరి ఆ తర్వాత వివాహం, పిల్లలు, వారి పోషణతో సరిపోయింది. అయినా ఉన్నత విద్యపై ఉన్న ఆసక్తికి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వేదికైంది. కుటుంబ స్థితిగతులు కొంత మెరుగయ్యాక అక్కడ ఆయన గతంలో ఓపెన్ విద్య విధానంలో డిగ్రీలో పూర్తి చేశారు. శ్రీధర్ భార్య ఉమాదేవికి కూడా ఉన్నత విద్యపై మక్కువే. చదువుపై ఆసక్తి ఉన్నా పిల్లల పెంపకం అడ్డంకిగా మారింది. అయినా అడ్డంకులను ఛేదించుకొని.. తన భర్త బాటలోనే అదే వర్సిటీలో డిగ్రీలో చేశారు. కుమారుడు కార్తీక్ కూడా సార్వత్రిక విద్యాలయం నుంచి ఎం.కామ్ పూర్తి చేసి అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. పెద్దకుమార్తె ఎస్.విద్య సైతం ఇదే వర్సిటీలో ఎమ్మెస్సీ సైకాలజీ పూర్తిచేశారు. చిన్న కుమార్తె ఎస్.గాయత్రి తాజాగా అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తిరుపతి అధ్యయన కేంద్రంలో ఎం.కామ్ పూర్తి చేసి, ఉత్తమ ప్రతిభతో బంగారు పతకానికి ఎంపికయ్యారు. లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తర్వాత వెనుకడుగు వేయొద్దని ఆమె అంటున్నారు. పోటీపరీక్షలకు సిద్ధమవుతూ ఎం.కామ్ చదివానని తెలిపారు.



అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చదువుకున్న తిరుపతికి చెందిన కుటుంబం

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి


సూళ్లూరుపేట: సరస్వతీదేవి అలంకారంలో చెంగాళమ్మ



నాయుడుపేట: సరస్వతీదేవి అలంకారంలో మూకాంబికాదేవి

చదువుల తల్లీ దీవించమ్మా..

సూళ్లూరుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకానంతరం అమ్మవారికి పుష్పలంకరణ చేశారు. తరువాత యాగశాల మండపంలో మహాచండీ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. సూళ్లూరు, నాగరాజపురం, వాటం బేడు రోడ్డు గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అలంకారం, చండీయాగానికి నెల్లూరుకు చెందిన దువ్వూరు హరిప్రసాద్‌రెడ్డి, జ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వీరికి సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవి, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వలంటరీ సంఘం సారె సమర్పించింది. నాగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పూజలు చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాటిపర్తి ఆదిరాయణరెడ్డి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పోలేరమ్మ, మానసాదేవి, దుర్గాదేవి, అంకమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మూకాంబికా దేవిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని, జారుకలశం వద్ద అమ్మవారిని, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని, గ్రామదేవత తాళమ్మను సరస్వతిదేవి అలంకారంలో, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవిని, నారాయణమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

చిల్లకూరు: మండలంలోని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని విద్యాలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

కోట: గూడలిలోని రామలింగ చాముండేశ్వరిని, కోట గ్రామదేవత కోటమ్మను, వాసవీ కన్యకా పరమేశ్వరిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరిని సరస్వతి దేవిగా, మూలవిరాట్‌కు ముత్యాల కవచం, కర్ణకమ్మ వీధిలోని కాత్యయనీ దేవికి సరస్వతిదేవిగా, వెంకటేశ్వర స్వామికి బలరామా వతారం, మంద నాంచరేశ్వరికి సరస్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పార్వతీదేవిని సరస్వతీదేవీగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


గూడూరు: సరస్వతీదేవి అలంకారంలో విజయదుర్గాదేవి


చిల్లకూరు: సరస్వతీదేవి అలంకారంలో ఆదిలక్ష్మి


గూడూరు: సరస్వతీదేవి అలంకారంలో గంగమ్మ


డక్కిలి: సరస్వతీదేవి అలంకరణలో పార్వతీదేవి


వెంకటగిరి: సరస్వతీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి


కోట: సరస్వతీదేవి అలంకారంలో కోటమ్మ


చిట్టమూరు: సరస్వతీ అలంకారంలో కామాక్షీదేవి


సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయానికి సారె తీసుకెళ్తున్న సూళ్లూరు, నాగరాజపురం గ్రామస్తులు

భూ ఆక్రమణపై ఫిర్యాదు

చిట్టమూరు, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): కుమ్మరిపాళెం గ్రామంలో 60 కుటుంభాలకు చెందిన భూమిని ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించారని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ నరేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మరిపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 16లో ఉన్న 26.06 ఎకరాల భూమిని 1974లో ప్రభుత్వం ఏడుగురికి పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో ముగ్గురు ఎస్టీలకు 9, ముగ్గురు ఎస్సీలకు 15, ఒక బీసీ వ్యక్తికి 2.06 ఎకరాలు కేటాయించారి పేర్కొన్నారు. అయితే ఎవరూ ఆ భూములకు సాగు చేయకపోవడంతో బీడుగా ఉండేవి. ఇద్దరు గిరిజనలు కూడా మృతి చెందారు. ఈ నేపథ్యంలో 2007లో గ్రామస్తులందరూ కలిసి పట్టాదారులతో ఒప్పదం కుదుర్చుకొన్నారు. పట్టాదారులకు కొంత మిగిల్చి, 60 కుటుంబాలకు 26 సెంట్ల లెక్కన పంచుకున్నారు. అప్పటి నుంచి 60 కుటుంబాలకు చెందిన వారు సాగు చేసుకుంటుండగా రెవెన్యూ అధికారులు అడంగల్లో కూడా నమోదు చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన రమణయ్య, సుబ్రహ్మణ్యం గ్రామస్తుల ఒప్పందానికి వ్యతిరేకంగా సదరు భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి రాత్రికిరాత్రే పొలాలను దున్నేస్తున్నారని కుమ్మరిపాళెంవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పందిస్తూ హామీ ఇచ్చారు.

11న మత్స్యకార సొసైటీ ఎన్నికలు

కోట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నక్క చెరువు, కేశవరం చెరువు మత్స్యకార సొసైటీలకు అక్టోబరు 11న ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం వరకు నామినేషన్లు స్వీకరించారు. నెల్లూరుపల్లి కొత్తపాళెంలోని పెన్నక్కమ్మతల్లి మత్స్యకార సొసైటీకి 9నామినేషన్లు, కేశవరం చెరువు మత్స్యకార సొసైటీకి 5 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు మహిజ, రఘు తెలిపారు.

కౌన్సిలర్‌కు పరామర్శ

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసులురెడ్డిని వైసీపీ ఇన్‌చార్జి నేదరుమల్లి రాంకుమార్ రెడ్డి, రాజా కుటుంబీకులు సర్వజ్ఞ యాచేంద్ర సోమవారం పరామర్శించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు అంగన్‌వాడీ కార్యకర్తలు, 66హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ వసంతబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15వ తేదీలోపు అర్హత కలిగిన అభ్యర్థులు కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8328562595ను సంప్రదించాలని కోరారు.

జీవితాంతం పార్టీ కోసం పనిచేస్తాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పార్టీ ఇచ్చిన పదవులకన్నా పార్టీ కోసం పనిచేయడమే తనకు సంతృప్తిగా ఉంటుందని టీడీపీ సీనియర్ నేత, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. 1982వ సంవత్సరంలో ఎన్టీ రామారావు పార్టీని స్థాపించినప్పటి నుంచి తాను, తన కుటుంబ సభ్యులు పనిచేస్తున్నామని తెలిపారు. జీవితాంతం పనిచేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష పదవి చేపట్టి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ తనకు ఈ పదవి అప్పగించిన పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడికి, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పండగ వేళ జీఎస్టీ శ్లాబ్ తగ్గించి సామాన్యుల కొనుగోలు శక్తిని పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ చైర్మన్ సదాశివం, టీఎన్‌టీయూసీ నాయకులు హేమంత్‌రాయల్, యశ్వంత్‌రెడ్డి, రాజయ్య, రవి శంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ కోలుకోవాలని పూజలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వైరల్ ఫీవర్‌తో ఇబ్బంది పడుతున్న జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం అలిపిరి గరుడ వలయం వద్ద బ్యానర్ ప్రదర్శిస్తూ శ్రీవారిని వేడుకున్నారు. పాదాల మండపం వద్ద 201 కొబ్బరికాయలు కొట్టారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, హరిశంకర్, రుద్రకిషోర్, మనోజ్, దినేష్‌జైన్, సుమన్‌బాబు, మునస్వామి, అనీల్‌రాయల్, సునీల్, వెంకటేశ్, మధులత, రాధ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రేపు గరం గరం చాయ్ పుస్తకావిష్కరణ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఆర్సీ కృష్ణస్వామి రచించిన గరం గరం చాయ్ పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు పీఆర్ఎస్ఐ చైర్మన్ డాక్టర్ జీ.ఎస్.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా త్రిపురలోని దమ్మదీప అంతర్జాతీయ బౌద్ధ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం.పి.నరసింహరాజు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

హనుమంత, గజవాహనాలపై శ్రీహరి అభయం

తిరుపతిరూరల్, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా సోమవారం స్వామి వారు ఉదయం హనుమంతవాహనంపై, రాత్రి గజవాహనంపై ఊరేగి భక్తులకు అభయమిచ్చారు.

టీడీపీ కార్యకర్త ఆత్మహత్య


ధనంజయ్య (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ ఇట్టగుంట ధనంజయ్య(35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో జరిగిన చిన్నపాటి వివాదంతో మనస్థాపం చెందిన ఆయన చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ కల్లూరుకు వెళ్లి ధనంజయ్య భౌతికాయానికి నివాళులర్పించారు.

కారు ఢీకొని బాలుడి మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం తుమ్మూరు సమీపంలో కారు ఢీకొనడంతో దియ ర్యాయన్ (3) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... తుమ్మూరులో నివాసం ఉంటున్న కిరణ్, వల్లెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు మహిధర్, దియర్యాయన్ ఉన్నారు. సోమవారం చిన్న కుమారుడు దియ ర్యాయన్ రోడ్డు పక్కన నిలబడి ఉండగా నాయుడుపేట నుంచి గూడూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలుడిని నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో దియర్యాయన్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గిన జీఎస్టీ ప్రకారం విక్రయాలు సాగించాలి

నాయుడుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ప్రకారం విక్రయాలు సాగించాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. సోమవారం పట్టణంలోని తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు, మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలకు దాదాపు రూ.15వేల వరకు ఆదా అవుతుందన్నారు. వ్యాపారులకు అమ్మకాలూ పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతిచెందిన ఘటన మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. తిరుమలనగర్ పంచాయతీ కోళ్లఫారాల సమీపంలో ఓ ఇంటికి పెయింటింగ్ చేస్తుండగా తిరుపతికి చెందిన లోకేశ్(36) విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తోటి కూలీలు సమీపంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే ఆ యువకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి భార్య ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించింది. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన హిమబిందు గానం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇస్కాన్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం గుంటూరుకు చెందిన విదుషి పొంగూరు హిమబిందు భక్తి సంగీత కచేరి అలరించింది. వనమాలి వాసుదేవ, రాధే రాధే గోవింద వంటి భజనలతోపాటు స్వాగతం కృష్ణ, అన్నమాచార్య సంకీర్తనలను రసరమ్యంగా ఆలపించి ఆహూతులను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. వయోలిన్‌తో జగదీశ్వరరావు, మృదంగంతో విద్యాధర్ సహకరించారు.

ముగ్ధమనోహరం.. అష్టలక్ష్మీ వైభవ నృత్యం

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక నాదనీరాజనం, ఆస్థాన మండపంలో టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఎస్వీ సంగీత నృత్య కళాశాలకు చెందిన సాయికిషోరి బోస్ బృందం అష్టలక్ష్మీ వైభవం నృత్య ప్రదర్శన ముగ్ధ మనోహరంగా సాగింది. తొలుత రవిప్రభ, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, వినోద్, విజయ్‌కుమార్ బృందం మంగళ ధ్వని, ఎస్వీ ఉన్నత వేద విద్యాధ్యయన సంస్థ వేద పారాయణం, లక్ష్మీ బృందం విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన కులకర్ణి బృందం భక్తి సంగీత విభావరి, స్థలశాయి భక్తి సందేశం భక్తిపారవశ్యాన్ని నింపింది.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎస్వీయూ కబడ్డీ జట్టు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బెలగవి రాణి చిన్నమ్మ యూనివర్సిటీలో అక్టోబర్ 4న జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎస్వీయూ పురుషుల జట్టు ఎంపికైంది. సోమవారం ఉదయం ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులకు జెర్సీ అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎస్వీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌రెడ్డి హాజరై 16మంది క్రీడాకారులను అభినందించారు. జట్టు మేనేజర్, కోచ్ గోవర్ధన్ పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు

డక్కిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో మోపూరు, లింగసముద్రం, ఆల్తూరుపాడు, గొల్లపల్లి సొసైటీల అధ్యక్షుడు పులి జనార్ధనరెడ్డి, కాసరం చైతన్య, నర్రావుల భాస్కరనాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దుగ్గి వెంకటేశ్వర్లు, దందవోలు పెంచలరెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ధరల తగ్గింపు

గూడూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పలు వస్తువులు తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చాయని వాణిజ్య పన్నులశాఖ జిల్లా రిజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర అన్నారు. సోమవారం వాణిజ్య పనులశాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా జీఎస్టీని తగ్గించడం జరిగిందన్నారు. దీని వల్ల నిత్యావసరాలు తక్కువ ధరకే లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వాణిజ్యపనుల శాఖ అసిస్టెంట్ కమిసనర్ ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా మృత్యుంజయుడికి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరా లయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి కర్పూర హారతులిచ్చారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

'అమరా'లో వరల్డ్ హార్ట్ డే



రేణిగుంట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని అమరా ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రమాదేవి సూచించారు. అమరా ఆస్పత్రిలో సోమవారం వరల్డ్ హార్ట్ డేను నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి వెలుపల డాక్టర్లతో కలిసి బెలూర్లను గాలిలోకి వదిలిపెట్టారు. కార్డియాలజిస్టులు వెంకట శివకృష్ణ, వెంకటేష్ గురజాల, నౌషద్, డాక్టర్లు శివరామకృష్ణ, రమ్య సాయి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

- తప్పిన పెను ప్రమాదం



నాగలాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ బస్టాప్ సమీపంలోని సెల్ టవర్ పక్కన పొలంలో కారు దూసుకెళ్లింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. చెన్నై నగరం మాధవరానికి చెందిన నలుగురు ఆదివారం రాత్రి తిరుమల దైవదర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో సుబ్బానాయుడు కండ్రిగ సమీపంలో సెల్ టవర్ వద్ద కుక్క అడ్డు రావడంతో తప్పించే క్రమంలో పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులో ప్రయాణించిన వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు. వాహన యజమానులు క్రేన్ సాయంతో వాహనాన్ని వెలుపలికి తీసి మాధవరానికి వెళ్లిపోయారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పుత్తూరు వార్తలు

సరస్వతీదేవిగా ద్రౌపది అమ్మవారు


సరస్వతి దేవి అలంకరణలో ద్రౌపది దేవి - కామాక్షి శివ పూజ అలంకరణలో కామాక్షమ్మ - సరస్వతి దేవిగా నాగాలమ్మ

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పుత్తూరు పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతి దేవి అలంకరణలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ క్రిష్టప్ప మెదలి, మాజీ చైర్మన్ యుగంధర్, సభ్యులు మునిచంద్ర, దామోదరం, పురోహితులు మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మ అమ్మవారిని కామాక్షి శివపూజ అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దిలీప్, ఈవో విజయకృష్ణ, సభ్యులు పార్థీబన్, శ్రీధర్, పూజిత, చిలకమ్మ పాల్గొన్నారు. రైల్వే క్వార్టర్స్ నందు వెలిసియున్న నాగాలమ్మ అమ్మవారిని సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎబ్బూరు సూర్యనారాయణ పాల్గొన్నారు. రాచపాలెంలో ఉన్న లక్ష్మీకనకదుర్గమ్మను సరస్వతి దేవిగా అలంకరించారు.



వడమాలపేట(ఆంధ్రజ్యోతి):నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారిని సరస్వతీ దేవి రూపంలో అలంకరించారు. సాయంత్రం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మంగళ హారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రాసాదాలు అందజేశారు.

దివ్యాంగురాలికి వీల్ చైర్ వితరణ



వడమాలపేట,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగురాలికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు వీల్ చైర్ వితరణ చేశారు. వడమాల పేట గుంటకట్ట వీధిలో నివసిస్తున్న దివ్యాంగురాలు దివ్యకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... ప్రతి ఒక్కరు తమకు చేతనైనంత సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణ్, షబ్బీర్, కృష్ణ, కిట్టి, శివకుమార్, తులసితదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి


వైద్య సిబ్బంది ధర్నా

పుతూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద డాక్టర్లు, వైద్య సిబ్బంది ధర్నా చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ... సేవలు అందించే ఉద్యోగుల మీద దాడులు చేయడం భావ్యం కాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం గాయాలతో వచ్చిన మునికేశవులుకు కార్తీక్ అనే ఉద్యోగి చికిత్స చేస్తున్న సమయంలో ఇద్దరి మధ్య మాటామటా పెరిగి, కార్తీక్‌పై మునికేశవులు దాడి చేయడం దీనిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

- అధికారులే లక్ష్యంగా కౌన్సిల్ సభ్యుల విమర్శలు


ఫ్లోర్‌లీడర్ జీవరత్నం నాయుడుతో మున్సిపల్ చైర్మన్ హరి వాగ్వాదం

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ పాలకమండలి పట్టణంలో అభాసుపాలు కాకుండా మున్సిపల్ అధికారుల తీరుపై విరుచుకు పడుతోంది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలకు, పారిశుధ్యం నిర్వహణకు అధికారులు సహకరించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానం చేసింది. టీడీపీ కౌన్సిలర్ల ఫ్లోర్ లీడర్ జీవరత్నం నాయుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తీసుకొచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కౌన్సిలర్ల నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తుండగా... అన్ని వార్డుల గురించి మాట్లాండేందుకు మీరు చైర్మన్ కాదంటూ మున్సిపల్ చైర్మన్ హరి అడ్డుతగిలారు. తాను ఫ్లోర్ లీడర్ అని, మాట్లాడే హక్కు ఉందంటూ జీవరత్నం నాయుడు అన్నారు. దీంతో ఇరువురి మద్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి వైద్యురాలు దీర్ఘకాలిక సెలవులో వెల్లిందని, మహిళలు, నగరి, తిరుపతికి వెళ్లాల్సి వస్తోందని, దంత వైద్యుడు రోజు మార్చి రోజు వస్తున్నారని, రాత్రి వేళలో డాక్టర్లు ఉండటం లేదని సమావేశం దృష్టికి ఓ కౌన్సిలర్ తీసుకొచ్చారు. తసంపూర్తిగా ఉన్న మున్సిపల్ కార్యాలయం పైఅంతస్తును పూర్తి చేయాలని కోరారు. మున్సిపల్ పార్కులో మరుగుదొడ్డి నిర్మాణంపై చర్చించారు. 11 అంశాలతో కూడిన అజెండాలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక పురోగతికి నాంది



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త దశకు నాంది అని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రేణుక అన్నారు. సోమవారం పట్టణంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమానికి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ చెన్నారెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని మెడికల్, ఎలక్ట్రానిక్ వస్తు దుకాణాలను తనిఖీ చేశారు. వస్తువులను కొనుగోలు చేసిన ప్రజలతో మాట్లాడారు. వస్తువుల కొనుగోలుపై జీఎస్టీ రాయితీ అమలు చేయకపోతే ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, ఆడిటర్లు, అకౌంటెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



రేణిగుంట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోదాముల వద్ద నిరంతరం పటిష్ట భద్రత ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. విమానాశ్రయం సమీపంలో ఈవీఎంలను భద్రపరచిన సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాములను సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్లతో పాటు భద్రతా చర్యలను పరిశీలించారు. గోదాములో లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకోసారి ఈవీఎం గోదామును పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, రేణిగుంట తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

పిచ్చాటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పేదలకు భూ పంపిణీ చేపట్టాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌కు చేరుకున్న ఎమ్మెల్యే ... కలెక్టర్, డీఆర్వో నరసింహులును మార్యదపూర్వకంగా కలిసి భూ పంపిణీతో పాటు సత్యవేడు నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పిచ్చాటూరు మండలం ఎస్ఎస్‌బీ పేటలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. నీరువాయి దళితవాడకు చెందిన సీజేఎస్ఎఫ్ భూములను వారికే పంపిణీ చేయాలని కోరారు. అనంతరం డీపీవో సుశీలాదేవిని కలసి నియోజకవర్గంలో పంచాయతీరాజ్ అభివృద్ధి పనులు పురోగతిపై చర్చించారు. పిచ్చాటూరు వయా కేవీబీ పురం, శ్రీకాళహస్తి మార్గంలో ఆర్టీసీ బస్సు సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జగదీష్‌ని కోరారు. ఈ మేరకు తిరుపతిలోని ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో ఆర్ఎంకు వినతిపత్రం సమర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, మణి, రమేష్, బాలాజి, ప్రవీణ్, నాదముని తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్ ప్రమాణ స్వీకారం



పిచ్చాటూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పదవికి వన్నె తెచ్చి, అందరికీ అందుబాటులో ఉంటానని సింగిల్‌విండో చైర్మన్ జయచంద్ర నాయుడు అన్నారు. పిచ్చాటూరు పీఏసీఎస్ ఆవరణలో ఆయన సింగిల్ విండో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వి.మాధవులు నాయుడు, సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు, మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభ రాజు, జయచంద్రారెడ్డి, నాగరాణి, హరీష్‌నాయుడు, శరత్‌నాయుడు, రాజేష్‌నాయుడు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద వర్గాలకు మేలు



బీఎన్‌కండ్రిగలో అధికారుల ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగత వర్గాల ప్రజలకు మేలు కలుగుతోందని ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి తెలిపారు. మండల కేంద్రంలో జీఎస్టీ తగ్గింపుపై అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమందూరులో పలు ప్రొవిజన్ షాపులను శ్రీకాళహస్తి జీఎస్టీ సర్కిల్ ఆఫీసర్ సౌభాగ్యలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. పలు షాపుల వద్ద కొత్తగా ప్రవేశపెట్టిన జీఎస్టీ ప్రకారం విక్రయాలు సాగుతున్నాయా లేదా అని ఆరా తీశారు. జీఎస్టీ తగ్గించి విక్రయించాలని దుకాణ యజమానులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి కిషోర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ వారోత్సవాలను విజయవంతం చేయాలని సేల్స్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జీఎస్టీ వారోత్సవాల నిర్వహణపై ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ... నెల రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. నిత్యావసర సరుకులపై వస్తు సేవల పన్ను తగ్గిందన్నారు. ఈ మేరకు సూపర్ మార్కెట్, ప్రొవిజన్స్ స్టోర్, కిరాణా కొట్టు యజమానులు పాతస్టాక్ పేరుతో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీసిటీ సర్కిల్ ఎక్స్‌క్లూజివ్ టాక్స్ అధికారులు ఎం.సతీష్, వెంకటముని, ఇంచార్జి ఎంపీడీవో త్రివిక్రమరావు, ఈవోపీఆర్‌డీ మునిరవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



ఏర్పేడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అధికారులు కందకం తవ్వినా ఇసుక అక్రమార్కులు ప్రత్యామ్నాయ మార్గంలో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొత్తవీరాపురం, మోదుగులపాళెం మధ్య స్వర్ణముఖి నది సమీపంలో వంతెనకు ఆనుకుని అక్రమార్కులు ఇసుకను తరలిస్తుండడంతో రెవెన్యూ అధికారులు ఆదివారం కందకం తవ్వారు. అయినా ఇసుకాసురులు ఇసుకను పలు మార్గాల్లో తరలిస్తున్నారు. దీంతో తహసీల్దారు భార్గవి ఆదేశాల మేరకు కొత్తవీరాపురం రెవెన్యూ అధికారి శ్రీవిద్య సోమవారం దాడులు చేపట్టారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయంలో అప్పగించారు.

లోక్ కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): లోక్ కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ కోరారు. పురపాలకసంఘ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీధి వ్యాపారులకు బ్యాంకులు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో చెల్లిస్తే ఎక్కువ మొత్తంలో రుణం ఇస్తారన్నారు. కమిషనర్ భవానీ ప్రసాద్, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

కరుణించు జ్ఞానప్రదాయిని



సరస్వతిదేవిగా ఆనందవల్లి



చిందేపల్లి పార్వతిదేవి



సర్వమంగళాదేవి



అంబూరు కామాక్షమ్మ



పిచ్చాటూరు వాసవీ కన్యకాపరమేశ్వరి



దక్షిణ కాళికాదేవి,



ముత్యాలమ్మ



కనకదుర్గమ్మ



సరస్వతిదేవిగా చిన్నగంగమ్మ



భాస్కరపేట చాముండేశ్వరి



పొన్నాలమ్మ



నల్లగంగమ్మ



బహదూరుపేట కన్యకాపరమేశ్వరి



బజారువీధి కన్యకాపరమేశ్వరి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కరుణించు జ్ఞానప్రదాయిని అంటూ భక్తులు అమ్మవార్లకు ప్రణమిల్లారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తి బండాసుర వధ అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి రంగులగోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఉత్సవమూర్తి మహాగౌరీదేవిగా భక్తులను కటాక్షించారు. ఇదే ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ మహాసరస్వతిదేవిగా వరాలు కురిపించారు.ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకాళహస్తి మండలం వేడాంలో కొలువై ఉన్న దక్షిణకాళికాదేవి, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి, ముత్యాలమ్మ అమ్మవారు సరస్వతిదేవిగా, ఏడుగంగల అమ్మవారు మహాగౌరిగా దర్శనమిచ్చారు. పానగల్‌లో కొలువై ఉన్న గంగమ్మ ప్రత్యేక అలంకారంలో, భాస్కరపేట చాముండేశ్వరి, పానగల్‌లో పొన్నాలమ్మ, బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ, తెట్టు వద్ద నల్లగంగమ్మ సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి జ్ఞానసరస్వతిగా దర్శన భాగ్యం కల్పించారు. విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసలవీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

శయన అలంకరణలో మరగదాంబిక

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పల్లికొండేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మరగదాంబిక అమ్మవారు పల్లికొండేశ్వర శయన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ వాహన మండపంలో మరగదాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సర్వమంగళాదేవి అమ్మవారు సోమవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని తమలపాకులతో అలంకరించారు. ఆలయ ధర్మకర్త రవికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంబూరులోని కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని రజానగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు భక్తులకు సరస్వతి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో కొలువై ఉన్న ఆనందవల్లి అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులను కటాక్షించారు. గుడిమల్లం ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో భక్తుల అమ్మవారికి పుష్పాలు సమర్పించారు. గుడిమల్లం ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా చిందేపల్లి పార్వతీదేవి అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం కల్పించారు.



శయన అలంకరణలో మరగదాంబిక



బండాసుర వధ అలంకారంలో జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తి



బొమ్మలకొలువులో మహాగౌరి అలంకారంలో జ్ఞానప్రసూనాంబ



మహాగౌరి అలంకారంలో ఏడుగంగల అమ్మవారు

డప్పుకు జాతీయ గుర్తింపు

- ప్రారంభమైన ఏపీడీకేఎస్ జిల్లా సభలు



పట్టణంలో డప్పు కళాకారుల ర్యాలీ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అతి ప్రాచీన కళ డప్పుకు జాతీయ గుర్తింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా సభలు పట్టణంలోని మహేష్ కల్యాణ్ సదన్‌లో సంఘ జిల్లా నాయకులు సంక్రాంతి వెంకటయ్య, పెంచలయ్య అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా వచ్చిన వందలాది మంది డప్పు కళాకారులు పట్టణ నాలుగు మాడవీధుల్లో డప్పుల మోత మోగించారు. అనంతరం ర్యాలీగా మహేష్ కల్యాణ్ సదన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ... పాటకు, ఆటకు గుర్తింపు ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డప్పుకు ఎందుకు గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. కళలకు రూ.7వేలు పింఛను ఇస్తుండగా ప్రాచీణ కళ డప్పును నమ్ముకున్న కళాకారులకు రూ.4వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. డప్పు కళాకారుల వయోపరిమితిని 45కు తగ్గించి పింఛను రూ.7వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులకు ధార్మిక క్షేత్రాల్లో ప్రదర్శనలకు, ట్రస్టుబోర్డు పదవులకు అవకాశం కల్పించాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు బస్సు, రైలులో రాయితీ ఇవ్వాలన్నారు. డప్పు కళ అంతరించి పోకుండా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రూ.10లక్షలు ప్రమాదబీమా చెల్లించాలని కోరారు. వందవాసి నాగరాజు, అంగేరి పుల్లయ్య, దాసరి జనార్దన్, పెంచలయ్య, రెడ్డిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి: సీపీఐ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్లు జనార్దన రాజు, భారతికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మించల శివకుమార్, శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలో భగత్‌సింగ్‌కాలనీ, అమ్మపాళెం, కొత్తపాళెంమిట్ట, తొండమనాడు, పుల్లారెడ్డికండ్రిగ, తొట్టంబేడు మండలం ఎల్ఐసీకాలనీ, ఈదులగుంట, తొట్టంబేడుల్లో ఉన్న పేదలకు ఇంటి స్థలం, నిర్మాణం కోసం రూ.5లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. రాజయ్య, గోపాల్, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం... ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం సోమవారం భక్త జన సంద్రంగా మారింది. దసరా సెలవుల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 29వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 84 మంది, రూ.200 శీఘ్ర దర్శనం 1,403, రూ.50ప్రత్యేక దర్శనం ద్వారా 2,390మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,882మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,019, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 287, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 193, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 52మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,467 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మండలాభివృద్ధికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎంపీపీ మునిలక్ష్మి కోరారు. సోమవారం కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ... అధికారులు శ్రద్ధ పెట్టి పేద మండలమైన ఇక్కడ సేవలు చేయడానికి ముందుకు రావాలన్నారు. ప్రస్తుతానికి మండలంలో ఆరు పంచాయతీ కార్యాలయాల నిర్మాణాలను మంజూరు చేయించుకు వచ్చానని వాటిని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం మహిళలకు స్త్రీనిధి కింద రూ.2 కోట్లను అందజేశారు. అలాగే ఇప్పటి వరకు మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్, త్వరలోనే 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వనున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, పార్వతి, తహసీల్దారు రోశయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో ఫరూఖ్, ఏపీఎం ఇందిరాగాంధీ, ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌శర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు మోహన్, విద్యాసాగర్, ఏపీఆర్వో రవి, స్థానిక కోర్టు న్యాయమూర్తులు శ్రీనివాసనాయక్, బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సైద్ధాంతిక పోరాటం

- శిక్షణ తరగతుల కరపత్రాల ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి, ప్రజా సమస్యల పోరాటాలకు కార్యకర్తలను చైతన్యవంతుల్ని చేయడానికి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు సీపీఐ నాయకులు చెప్పారు. అక్టోబరు 5 నుంచి 10తేది వరకు వరదయ్యపాళెం మండలం ఉబ్బలమడుగులో సీపీఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలను బీఎన్‌కండ్రిగలో ఆవిష్కరించారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, పార్టీ ఏరియా కార్యదర్శులు చిన్నిరాజ్, జనమాల గురవయ్య, మండల కార్యదర్శి రమణయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పౌరుల హక్కులపై అవగాహన

వరదయ్యపాళెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పౌరులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ నల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని కురింజలం గిరిజన కాలనీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ పౌర హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో సమానత్వం, న్యాయం అందుతుందన్నా రు.

సత్యవేడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్ కండ్రిగ గిరిజన కాలనీలో డీటీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో త్రివిక్రమరావు, వీఆర్వో జగదీష్, వీఏవో రత్నం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

